క్లుప్తంగా

అక్రమ రవాణా అడ్డుకోవాలని వినతి

భీంపూర్: పశువులను అక్రమంగా రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు హెడ్ కానిస్టేబుల్ విఠల్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. మూగజీవాలను కాపాడాలని కోరారు. నాయకులు అంకం అశోక్, గుర్ల నారాయణ, సవాయి స్వామి, సోమేశ్వర్, సంజీవ్, గజానన్, సన్నీత్ రెడ్డి, అశోక్ భోజన్న, అనిల్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ పనులు నిలిపివేసిన కార్యదర్శులు



ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం గత 18 నెలలుగా పెండింగ్ బిల్లులు చెల్లించనందున ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ, మోటర్ రిపేర్, వీధి దీపాలు ఏర్పాటు, గడ్డి మందులు కొనుగోలు వంటి ఆర్థికపరమైన పనులు నిలిపివేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీలకు 2024 ఆగస్టు నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. సునీల్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్, రెడ్డినాయక్, గంగాసాగర్, సాయికృష్ణ, సౌందర్య, అశోక్, లావణ్య, సాయిశృతి, షబాన పాల్గొన్నారు.

బాబెరతండాగా పేరు మార్పు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని లంబాడాతండా గ్రామాన్ని ప్రభుత్వం బాబెరతండా గ్రామంగా పేరు మార్పు చేసింది. గతంలో బాబెరతండాగా ఉన్న పేరును పదేళ్ల క్రితం అధికారులు లంబాడాతండాగా మార్చారు. తమ గ్రామం పేరును బాబెరతండాగానే కొనసాగించాలని పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు వేడుకున్నారు. తమ గ్రామం పేరు మార్పునకు కృషి చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్తులు శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లింగాష్టక పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల మండలంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న సామూహిక లింగాష్టక పారాయణం 14వ వారానికి చేరుకుంది. 21 వారాల పాటు సామూహిక లింగాష్టక పారాయణాన్ని నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. అనంతరం కటకం చంద్రకాంత్ బాబు, మమత దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిరసన శిబిరం సందర్శన

కై లాసనగర్: తమ వ్యాపారాలను ప్రధాన చౌక్‌ల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ వీధి వ్యాపారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన శిబిరాన్ని సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సందర్శించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వీధి వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

బోథ్: తన పదవులు పక్కన పెట్టి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ రాష్ట్ర జాతిపితగా ప్రకటించాలని బోథ్ పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు ఏఐటీయూసీ మహాసభ

బోథ్: మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30లకు ఏఐటీయూసీభవన్‌లో మహాసభను నిర్వహిస్తున్నట్లు మండల కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బజార్‌హత్నూర్: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్యాంసుందర్



నేరడిగొండ: జాతీయగీతాన్ని ఆలపిస్తున్న అధికారులు, సిబ్బంది



ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ శాఖ కార్యాలయంలో..



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలు పణంగా పెట్టారన్నారు. అనంతరం తెలంగాణ తల్లికి పూలమాలలు వేశారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ జేఆర్ చౌహాన్, జిల్లా విద్యాశాఖ, వయోజన విద్యా కార్యాలయాల్లో డీడీ శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్‌వో కార్యాలయంలో నరేందర్ రాథోడ్, ఆయా శాఖల్లో అధికారులు వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కంది శ్రీనివాస రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. – సాక్షి నెట్‌వర్క్



కైలాసనగర్: జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి, నాయకులు, కార్యకర్తలు



తలమడుగు: తహసీల్దార్ కార్యాలయంలో..



ఇచ్చోడ: మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో..



తాంసి: తహసీల్దార్ కార్యాలయంలో..



బేల: ఎంపీడీవో కార్యాలయం వద్ద..



సిరికొండ: జెండా ఆవిష్కరిస్తున్న సిబ్బంది



ఇంద్రవెల్లి: పీఏసీఎస్ కార్యాలయంలో..



తెలంగాణ తల్లికి పూలమాల వేస్తున్న రామన్న

రైతులపై టార్పాలిన్ల భారం



జొన్న కుప్పలపై కప్పి ఉంచిన టార్పాలిన్లు

- ఐదేళ్ల క్రితం కవర్ల పంపిణీ నిలిపివేత
- అందుబాటులో లేక ఇబ్బందులు
- వర్షాలకు తడిసిపోతున్న పంట దిగుబడులు

తాంసి: అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం జొన్నతో పాటు ఇతర పంటలు చేతికొచ్చాయి. పంటలను మార్కెట్‌కు తరలించి విక్రయించే సమయంలో వర్షాలు కురవడంతో తడిసిపోతున్నాయి. పంటలు తడిసిపోకుండా రక్షణగా కప్పి ఉంచేందుకు రైతులు టార్పాలిన్ కవర్లను వినియోగిస్తుంటారు. గతంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై వ్యవసాయశాఖ ద్వారా టార్పాలిన్లను అందించేది. అకాల వర్షాలకు పంటలు తడిసి నష్టపోకుండా సబ్సిడీపై అందించే టార్పాలిన్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. గత ఐదేళ్లుగా రాయితీపై అందించే టార్పాలిన్ కవర్లను పంపిణీ చేయడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. గతంలో రైతులు రాయితీపై తీసుకున్న టార్పాలిన్లు సైతం ప్రస్తుతం పూర్తిగా చెడిపోయాయి.

తడిసిపోతున్న పంటలు..

ప్రస్తుతం సీజన్‌లో వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో భాగంగా రైతులు సాగుచేసిన పంటలు చేతికొచ్చాయి. జొన్న, వేరుశనగ, పెసర, మినుము, నువ్వు తదితర పంటలు వరుసగా కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిపోతున్నాయి. జొన్నలు అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులకు మార్కెట్‌లో సరైన వసతులు లేక వర్షానికి జొన్నపంట పలుచోట్ల పూర్తిగా తడిసిపోయింది. తడిసిన జొన్నలను వర్షం తగ్గాక ఆరబెట్టేందుకు టార్పాలిన్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రభుత్వం కవర్లు పంపిణీ చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

రైతులపై అదనపు భారం..

గతంలో ప్రభుత్వం ఉద్యాన, వ్యవసాయశాఖల ద్వారా టార్పాలిన్ కవర్లను రాయితీ ద్వారా అందసింది. 250 జీఎస్ఎం (మందం) నాణ్యత, 8 మీటర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పు కలిగిన టార్పాలిన్ కవరు ధర మార్కెట్‌లో రూ.2500 వరకు ఉండేది. ఇందులో 50 శాతం రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగా, మిగతా 50 శాతం రూ.1250 రైతులు చెల్లించి టార్పాలిన్ కవర్లు తీసుకునేవారు. చివరిసారిగా 2017–18 ఆర్థిక సంవత్సరంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయశాఖ తరఫున టార్పాలిన్ కవర్లను అందజేశారు. అనంతరం పంపిణీ నిలిపివేయడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కవర్లను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

సబ్సిడీపై అందేలా చూడాలి



సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు లేక అధిక ధరకు కవర్లను కొనుగోలు చేస్తున్నాం. సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది. కవర్లు అందుబాటులో లేక చేతికొచ్చిన పంటలు తడిసిపోతున్నాయి. టార్పాలిన్ కవర్లను అందించాలి.
– నవనీత్, రైతు, వడ్డాడి గ్రామం

సరఫరా లేదు..



గత ఐదేళ్ల క్రితం వరకు రైతుల కోసం ప్రభుత్వం టార్పాలిన్ కవర్లను సరఫరా చేసింది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ టార్పాలిన్ కవర్లను అందించడం లేదు.
– రవీందర్, వ్యవసాయాధికారి, తాంసి

రైతులకు విత్తనాలు అందజేత



రైతులకు కంది విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అందజేస్తున్న కంది విత్తనాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం బోథ్‌లోని క్యాంపు కార్యాలయంలో రైతులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిలీ విత్తనాలను కొని రైతులు మోసపోవద్దన్నారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు స్వామి, తిరుమల్ గౌడ్, ప్రశాంత్, సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



భూమిపూజ చేస్తున్న ఆడే వసంత్‌రావు

నేరడిగొండ: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం సోమవారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ఎండీ సద్దాం, కపిల్ జాదవ్, కుంట శంకర్, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, లబ్ధిదారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని అడేగామ బిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో లక్ష్మణ్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు ప్రతీ ఒక్కరికి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ అనిత సుభాష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.



భారీ వాహనం వెనుక లేస్తున్న దుమ్ము

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి ఎక్స్‌రోడ్డు నుంచి నిపాని గ్రామం వరకు కొనసాగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. భారీ వాహనాలు రోడ్డుపై వెళ్లడంతో దుమ్ము ధూళితో ఇక్కట్లకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

'జొన్న డబ్బులు రైతులకు చెల్లించాలి'



సుంకిడిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తలమడుగు: ప్రభుత్వం రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదని, వెంటనే డబ్బులు చెల్లించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంతర్రాష్ట్ర రహదారిపై తాంసి, తలమడుగు మండలాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రహదారిపై ఆందోళన చేపట్టడంతో ప్రజలు ఇబ్బంది పడగా ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిందర్ అక్కడికి చేరుకుని ధర్నా విరమింపచేశారు. బీఆర్ఎస్ నాయకులు మొట్ట కిరణ్ కుమార్, కేదరేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, నరసింహులు, గంగాధర్, ఆశన్నయాదవ్, ప్రకాశ్, శ్రీనివాస్, కిషన్, మల్లేష్, మహేందర్, ఉత్తమ్ కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: రాష్ట్ర ప్రభుత్వం 2, 3 నెలల క్రితం కొనుగోలు చేసిన జొన్న ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని మాజీ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన రైతులకు ఇప్పటికీ రుణమాఫీ జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మోడల్‌స్కూల్‌కు ప్రభుత్వ విద్యార్థుల ఎంపిక

బోథ్: బోథ్‌లోని మోడల్ స్కూల్‌కు ఏడుగురు ప్రభుత్వ విద్యార్థులు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన అవునూరి మోక్షశ్రీ, మిర్యాల నవదీప్, ఎనగందుల అర్చన, పందిరి నిత్య, పొలాజీ మైత్రి, పుట్టి కీర్తన, పవార్ సాయి శాన్విత్‌లు ఇటీవల విడుదల చేసిన ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. కాగా మిర్యాల అక్షర గురుకులంలో కూడా సీటు సాధించింది. ఒకే పాఠశాల నుంచి వీరంతా ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులు దీకొండ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.


రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



నేరడిగొండ: మాట్లాడుతున్న తహసీల్దార్ కలీమ్

ఇంద్రవెల్లి/జైనథ్/నేరడిగొండ/ఇచ్చోడ/కై లాసనగర్ : ఈనెల 3 నుంచి 20 వరకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతిపై గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. పాస్‌బుక్‌లో సర్వే నంబర్ లేకపోవడం, పేర్ల సవరణ, వారసత్వ పంపకాలు, భూ సేకరణ సమస్య, తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

సాత్నాల: పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలలో వైద్య చికిత్స చేయించుకున్న పేద ప్రజల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. సోమవారం భోరజ్ మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన సావాపూరే ఇందిరకు మంజూరైన రూ.60 వేల చెక్కు ఆమె నివాసానికి వెళ్లి అందించారు.